# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 20-07-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **వికసిత భారత్ లక్ష్యానికి అనుగుణంగా వికసిత ఆంధ్రప్రదేశ్-2047 ప్రణాళికను రూపొందిస్తున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**
2. **వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పలుచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి.**
3. **యువతలో నైపుణ్యాల అభివృద్దే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు.**
4. **విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలను అధికారులను ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి ఆదేశించారు.**
5. **తెలంగాణలో గ్రూప్ రాతపరీక్షల్ని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్-టీజీపీఎస్సీ వాయిదా వేసింది.**
6. **రేడియో ఆవిష్కర్త గుగ్లిఎల్మో మార్కోనీ వర్ధంతి ఈ రోజు.**

==========================

వికసిత భారత్ లక్ష్యానికి అనుగుణంగా వికసిత ఆంధ్రప్రదేశ్-2047 ప్రణాళికను రూపొందిస్తున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నీతి ఆయోగ్ ముఖ్య కార్యనిర్వహణాధికారి బీవీఆర్ సుబ్రహ్మణ్యం తోపాటు సంస్థ ప్రతినిధులతో సమావేశమైయ్యారు. రానున్న రోజుల్లో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలు, ప్రాజెక్టులపై నీతి ఆయోగ్ ప్రతినిధులతో ముఖ్యమంత్రి చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, పేదరికం లేని సమాజం, జనాభా సమతుల్యతపై ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. అన్ని రంగాల్లో కృత్రిమ మేధను అనుసంధానం చేసేలా.. రాష్ట్రంలో ఏఐ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. దేశాభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ తన వంతు పాత్ర పోషించేందుకు ప్రత్యేకమైన ప్రణాళికలతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

--------------------------

వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో పలుచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ అల్ప పీడనం ఈరోజు వాయువ్య దిశగా పయనించి, ఒడిసాలోని పూరీ వద్ద తీరాన్ని దాటనుందని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. ఆ తర్వాత ఈ అల్పపీడనం ఒడిసా,

ఛత్తీస్ ఘడ్ మీదుగా పశ్చిమ వాయువ్య దిశగా కదిలి, తదుపరి 24 గంటలలో క్రమంగా బలహీన పడుతుందని వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో కోస్తా, రాయలసీమల్లో మరో రెండు రోజుల పాటు ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. పలు జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయని, జిల్లాల్లో లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు.

మరోవైపు వర్షాల నేపధ్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరించేలా చర్యలు చేపట్టినట్లు పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఈ రోజు జిల్లాలోని అన్ని పాఠశాలలకు కలెక్టర్ సెలవు ప్రకటించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో వర్షాలకు నేలకొరిగిన వృక్షాలను తొలగిస్తున్నట్లు అధికారులు తెలియజేశారు. ఏలూరు జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాలలో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పర్యటించి వరద పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ రోజు జిల్లాలోని అన్ని పాఠశాలలకు కలెక్టర్ సెలవు ప్రకటించారు. బాపట్ల జిల్లాలోని ముంపు ప్రాంతాలను కలెక్టర్ జె.వెంకట మురళి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లాలో అవసరమైన అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని లంక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించామని పేర్కొన్నారు. వరద సహాయక చర్యల పర్యవేక్షణకు ప్రభావిత తొమ్మిది మండలాలకు జిల్లాస్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించామని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తెలిపారు.

---------------------------

అల్పపీడనం ప్రభావంతో తెలంగాణలో ఈ రోజు, రేపు అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఈరోజు ఉత్తర, ఈశాన్య తెలంగాణ జిల్లాలైన ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, అలాగే నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదారాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీ చేసింది.

భారీ వర్షాల నేపథ్యంలో ఆయా జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. గత రాత్రి జిల్లాల కలెక్టర్లతో సీఎస్ దృశ్య మాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముందస్తు చర్యలతో ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా కలెక్టర్లు జాగ్రత్తలు తీసుకోవాలని, 11 జిల్లాల్లోనూ కంట్రోల్ రూంలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

---------------------------

యువతలో నైపుణ్యాల అభివృద్ధే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు. నిన్న శ్రీసత్య సాయి జిల్లా పెనుకొండలో బీసీ సంక్షేమ శాఖ అధికారులతో మంత్రి సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ, త్వరలో జిల్లాలోని పెనుకొండ పట్టణంలో డీఎస్సీ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ లో నైపుణ్య గణన చేపట్టనున్నామని తద్వారా యువతకు తగిన నైపుణ్య శిక్షణ అందజేస్తామని తెలిపారు.

---------------------------

తెలంగాణలో వచ్చే మూడేళ్లలో ప్రభుత్వ పాఠశాలలను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం

చేయాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నిన్న హైదరాబాద్‌లో సమీకృత గురుకుల పాఠశాలలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సొంత గ్రామాల్లోనే విద్యార్థులు చదువుకునేలా, సమీకృత పాఠశాలల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అంగన్‌వాడీ పాఠశాలల తరహాలో మూడో తరగతి వరకు విద్యాబోధనకు ప్రణాళికలు రూపొందించాలన్నారు.

మరోవైపు తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన ఖరారైంది. ఆగస్టు 3న ముఖ్యమంత్రి అమెరికా బయల్దేరతారని ఈ పర్యటనలో భాగంగా పలు సంస్థల సీఈవోలు, పారిశ్రామికవేత్తలతో ఆయన సమావేశమవుతారని అధికారులు తెలిపారు.

---------------------------

తెలంగాణలో గ్రూప్-2 రాతపరీక్షల్ని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్-టీజీపీఎస్సీ వాయిదా వేసింది. ఆగస్టు 7, 8 తేదీల్లో జరగాల్సిన పరీక్షలను రీషెడ్యూలు చేసింది. ఈ పరీక్షలను డిసెంబరులో నిర్వహిస్తామని, తేదీలను తర్వాత ప్రకటిస్తామని తెలిపింది. గ్రూప్ -2 పరీక్షల అంశంపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నిన్న హైదరాబాద్‌లో అభ్యర్థులు, అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, డీఎస్సీ, గ్రూప్ 2 పరీక్షల మధ్య వారం రోజుల మాత్రమే వ్యవధి ఉండటంతో వాయిదా వేయాలని అభ్యర్థులు విజ్ఞప్తుల మేరకు గ్రూప్ పరీక్షలను వాయిదా వేయాలని అభ్యర్థులు చేసిన విజ్ఞప్తుల మేరకు గ్రూప్ 2,3 పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే ప్రతి శాసనసభ నియోజకవర్గ కేంద్రంలో పోటీ పరీక్షార్థుల కోసం అంబేద్కర్ విజ్ఞాన కేంద్రాలను ప్రారంభించి ఉచితంగా ఆన్‌లైన్ శిక్షణ అందిస్తామని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో శాంతి భద్రతలు క్షీణించాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. పల్నాడు జిల్లా వినుకొండలో హత్యకు గురైన రషీద్ కుటుంబాన్ని జగన్మోహన్ రెడ్డి నిన్న పరామర్శించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న హింసా ఘటనలపై ప్రధానమంత్రి నరేంద్రమోదీతో సహా పలువురు కేంద్రమంత్రులను కలిసి వివరిస్తామని చెప్పారు. దాడులకు నిరసనగా వైసీపీకి చెందిన పార్లమెంటు, శాసన సభ్యులతో కలిసి ఢిల్లీలో ధర్నా నిర్వహిస్తామని, రాష్ట్రపతి పాలన అమలు చేయాలని కోరతామని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నం జిల్లా సింహాచలం క్షేత్రంలో శ్రీవరాహలక్ష్మీనృసింహ స్వామివారి గిరి ప్రదక్షిణ మహోత్సవం ఈ రోజు ప్రారంభం కానుంది. ఏటా ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని చతుర్దశినాడు గిరి ప్రదక్షిణను నిర్వహిస్తారు. ఈ సాయంత్రం నాలుగు గంటలకు కొండ దిగువన తొలి పావంచా వద్ద నుంచి శ్రీవరాహలక్ష్మీనృసింహస్వామి పుష్పరథం గిరి ప్రదక్షిణకు బయలుదేరుతుంది. ఏడాదికి ఒకసారి జరిగే ఈ గిరి ప్రదక్షిణలో లక్షలాదిమంది భక్తులు పాల్గొననున్న నేపథ్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా తగు ఏర్పాట్లు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. పౌర్ణమి సందర్భంగా రేపు వేకువజామున స్వామివారికి తుది విడత చందన సమర్పణ చేయనున్నారు.

---------------------------

రేడియో ఆవిష్కర్త గుగ్లిఎల్మో మార్కోనీ వర్ధంతి ఈ రోజు. 1874 ఏప్రిల్ 25వ తేదీన ఇటలీలోని బోలొగ్నాలో

జన్మించిన ఆయన, సుదూర ప్రాంతాలకు రేడియో ప్రసారాలు పంపడంలో, రేడియో టెలిగ్రాఫ్ వ్యవస్థను అభివృద్ధి చేయడంలో పితామహుడిగా గుర్తింపు పొందారు. ఇతర భౌతిక శాస్త్రవేత్తల ప్రయోగాలను ఆధారంగా చేసుకొని మార్కోనీ రేడియో ను ఆవిష్కరించారు. 1909లో కార్ల్ ఫెడ్రినాండ్ బ్రాన్తో కలసి వైర్లెస్ టెలిగ్రాఫీ అనే అంశంపై భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి అందుకున్న ఆయన 1937 జూలై 20 వ తేదీన కన్నుమూశారు.

---------------------------

ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తావిభాగంలో కాజ్యువల్ బ్రాడ్కాస్ట్ అసిస్టెంట్‌గా పనిచేసేందుకు విజయవాడలో నివసించే అర్హులైన అభ్యర్థులనుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రాంతీయ వార్తావిభాగాధిపతి శ్రీ సాయి వెంపాటి ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే విశాఖపట్నం పార్ట్‌టైమ్ కరస్పాండెంట్‌గా పనిచేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తులు ప్రసారభారతి.జీవోవీ.ఇన్, న్యూస్ఆన్ ఎయిర్.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లలో అందుబాటులో ఉంటుందని, మరిన్ని వివరాలకు 9440674057 నెంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

========================